# ★ మూడు కొప్పు లొకచోట చేరితే ★

♦ ♦ రచన: జాలాది చౌదరి ♦ ♦

మా గ్రామంలో మహిళాసంఘాన్ని స్థాపించి నేటికి మూడుసంవత్సరాలైంది. కనుకనే యీనాడు వార్షికోత్సవం చేయడం చాలా ఉత్సాహంగా చేస్తున్నారు ఏర్పాటులు. ఆర్థికంగా చిక్కులు చాలా తక్కువగా ఉంటై గ్రామమహిళలకు. కారణం వెన్నపూస, మజ్జిగ వగైరా అమ్మినబాపతు చందాలుగా యిచ్చేరు.

మహాసభకు సీతాబాయమ్మగారిని అధ్యక్షురాలుగా ఆహ్వానించేందుకు ఏకగ్రీవంగా ఆమోదించింది మా గ్రామసంఘం లోగడ. మహాసభ ఏర్పాట్లన్నీ గ్రామసంఘాధ్యక్షురాలు మంగమ్మగారి యింటివద్దే జరిగినై.

ముందు పదిమందితో బయల్దేరిన ఊరేగింపు ఊరంతా తిరిగివచ్చేటప్పటికి రెండువందలమంది దాటేరు. మా గ్రామవీధులన్నీ "మహిళా సంఘాలకు జై" అనే నినాదాలతో మార్మోగినై. వాళ్ళ వుత్సాహం, పట్టుదల మగవాళ్ళు సిగ్గుపడేటట్లు చేసినై. వూరు నాలుగుమూలలూ తిరిగి మహాసభ మంటపమైన మంగమ్మగారియింటికి చేరుకున్నారు.

అంతా కిసరబిసరగా కూర్చున్నారు. సభ ప్రారంభించబోవుసరికి ఎక్కడమాట అక్కడే నిలచిపోయింది. అంతా నిశ్శబ్దం. కటికి నిశ్శబ్దం. విందామన్నా ఒక్క గుసగుసలేదు. కాని నిశ్శబ్ద వాతావరణాన్ని మా గ్రామమహిళా సంఘాధ్యక్షురాలు ఒక్క సకిలింపుతో మార్చేసింది. సగర్వంగా నాలుగుప్రక్కలా పరిశీలించి గొంతు సవరించుకుంటూ—

సోదరీమణులారా! నేడు చాలా సుదినం. కాకపోతే ఏనాడైనా మనం ఇంతమంది ఏ పేరంటంనాడో తప్ప సంఘరూపేణా ఇంతమందిఒక్కచోటకలుసుకోలేదు. ఈఒక్కసంఘటనే నిదర్శనం మనసంఘం ఎంత అభ్యున్నతికి పోతోందీ తెలుసుకోటానికి—నాకెంతో సంతోషంగావుంది. మరిచిపోయాను. యిప్పుడు మన మహిళాసంఘాల ఆదర్శం, మన సంఘాల భూతభవిష్యత్ వర్తమానాలు పలువు రుపన్యసించుతారు గనుక నిశ్శబ్దంగా వినాలని మనవి, అంటూ కూర్చుంది.

ముందుగా ఒకావిడ లేచింది రెండరటావులు చేత్తో పుచ్చుకుని (ఈమె పొరుగూరునుంచి ఆహ్వానంమీద వచ్చింది) కొంచెం స్టేజిఫియర్ ఉండట్లే ఉంది. కళకళ లాడుతున్న ముఖం నలువైపులా చూచి నల్లబడింది. దానికి తోడు, ఆమె లేవడమే తడువుగా, మహాసభలో గుసగుసలు బయల్దేరినై, సభను చూడగానే ఆమెకు ముచ్చెమటలు పోసి, కళ్ళుతిరిగి, కూర్చోబడకుండా ఉండలేకపోయింది. తరువాత ఇలా ఒక విషయంపైనా ఉపన్యాసాలు దంచేశారు.

ఇహ మహాసభాధ్యక్షురాలు వంతు వచ్చింది. ఉపన్యాసం, ప్రవాహంలాగ పోతోంది, పదాలు చాలా నిర్దాక్షిణ్యంగాను ఘాటుగాను ఉపయోగించబడుతున్నై. మంచి రసమయ ఘట్టంలో ఉండగా, మహాసభా మధ్యంలోంచి, ఎక్కడిదో సన్నని కీచుగొంతు వినిపించింది. అందరూ యిస్, యిస్ అంటున్నారు. అయినా ఆస్థాయి యింకో మెట్టు యింకో మెట్టుపైకి పోగా, మహాసభా మధ్యంలో జో, జో అంటూ జోలపాటతో— అవాంతరం ఏర్పడటంవల్ల, గ్రామ సంఘాధ్యక్షురాలు—ఆహ్వాన సంఘాధ్యక్షు హోదాలతో మందలించకుండా ఉండలేక పోయింది. ఆమె అన్నమాట లివి—

"ఎవరమ్మా! ఆపిల్లను ఏడిపించేది?" సమాధానం లేకపోవడంవల్ల పాలు యివ్వండని ఉచితంగా సలహా యిచ్చింది. అయినా లాభం లేకపోయేప్పటికి—కొంచెం విసువుగా "పాడుగోల! అవతలకు తీసుకు వెళ్ళకూడదూ" అంది. ఆ పళాన ఒక ఇల్లాలు గభీమని లేచి—

"నీకేం, గొడ్డుమోతువు; నీకు పిల్లల సంగతేం తెలుసూ? నా పిల్ల ఏడవటం—నీకు పాడుగోలగా ఉందా? నువు పాడవు నీ మొగుడు పాడవుతాడు, నీ సంసారం పాడవుతుందని నాలుగు దులిపి తన బాధ్యత తీరిపోయినట్టు తీరుబడిగా కూర్చుంది.

మాటకు మాట మనిషికి మనిషి తోడైనై. ఒక్కసారిగా మహాసభ బ్రహ్మాండమైన యుద్ధరంగంగా మారిపోయింది. దీన్నే కాబోలు "మూడు కొప్పు లొకచోట జేరితే పగలే నక్షత్రాలు మొలిపించుతారని" అంటారు.